క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలంలోని రామచంద్రాయపల్లె, మదిరెడ్డిపల్లె గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొంటారని మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జూదరుల అరెస్టు

ముద్దనూరు : మండలంలోని ఆకుతోటపల్లె గ్రామంలో గురువారం పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అరెస్ట్ చేసి వారినుంచి రూ.4520 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు.

నల్లపురెడ్డిపల్లెలో ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని జై కిసాన్ జంక్షన్ పులివెందుల వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి మందులను పంపిణీ చేశారు. కిమ్స్ వైద్యులు రాము సుమారు 120 మందికి గుండె జబ్బుకు సంబంధించి పరీక్షలు చేశారు. అనంతరం వైద్యులను గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు అభినందిచారు.

సుందరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



వేడుకల్లో భాగంగా స్వామి వారికి కలశస్థాపన

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కన్యతీర్థంలో గురువారం ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో 9వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అలంకరణతో పాటు గణపతి పూజ, కలిశారాధన, ఏకాదశ రుద్రాభిషేకం అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ నిర్వహకులు అన్నదాన, తీర్థ ప్రసాదాలు నిర్వహించారు.

సహకార బ్యాంకుల బలోపేతానికి కృషి

కలసపాడు : సహకార బ్యాంకులను బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆప్కాబ్ చైర్ పర్సన్ మల్లెలఝాన్సీరాణి పేర్కొన్నారు. మండలంలోని పుల్లారెడ్డిపల్లె వద్ద అంకాల పరమేశ్వరీ లేఅవుట్‌లో నాబార్డు నిధులతో నిర్మించిన కొత్తకోట సహకార పరపతి సంఘం భవనాన్ని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత డీసీసీ బ్యాంకులు లాభాల బాటలో నడుస్తున్నాయన్నారు. సహకార బ్యాంకులో 1600 పోస్టులు, జిల్లాలో 19 సీఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, త్వరలో వాటి నియామకాలు చేపడతామన్నారు. బ్యాంకుకు వచ్చిన రైతులకు సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. అనంతరం భవన నిర్మాణానికి ఉచితంగా స్థలాన్ని ఇచ్చిన వారిని వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మల్లెలరాజారామ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంకనగురివిరెడ్డి, సూదారామకృష్ణారెడ్డి, నారాయణయాదవ్, సుదర్శన్, చిత్తారాజశేఖర్‌రెడ్డి, పులివీరారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గురయ్య, షరీఫ్, సింగరయ్య, రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



మారెళ్లమడకలో ఓటుహక్కుపై ర్యాలీ నిర్వహిస్తున్న ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

చక్రాయపేట : మండలంలోని మారెళ్లమడక గ్రామంలో ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-9 విద్యార్థులు ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు యూనిట్-9 అధికారి బొజ్జా అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటివద్దకు వెళ్లి ఓటు హక్కు వినియోగం, దాని ఆవశ్యకతపై అవగాహణ కల్పించారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ సంచాలకులు కుమారస్వామి గుప్తా, గ్రామ సర్పంచు నరసింహులు, ప్రజలు విద్యార్థులు పాల్గొన్నారు

అశ్వ వాహనంపై శ్రీరంగనాథుడు



అశ్వవాహనంపై శ్రీరంగనాథుడు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న శ్రీరంగనాథుని కాంప్లెక్స్‌లో ప్రాచీన దేవాలయమైన శ్రీరంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా 8వరోజు గురువారం రాత్రి శ్రీరంగనాథస్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి అశ్వవాహనంపై వెలుతున్న తీరు, అమ్మవార్లు ముందు పల్లకిలో అలిగినట్లు వెలుతున్న దృశ్యాన్ని భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. స్వామి వారికి భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామోత్సవంలో భక్తులు చదుర్లు(విశేష పూజలు) నిర్వహించారు. తిరుణాల ప్రాంగణంలో సాయంత్రం రాజా కళానికేతన్ చిన్నారులచే నృత్యప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ కేవీ రమణలు సభ్యులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు :
శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు నేటితో ముగియనున్నాయి. 8 రోజులుగా స్వామివారు వివిధ అలంకారాలతో భక్తులకు దర్శనమిచ్చి కనువిందుచేశారు. 9వరోజు చివరిరోజు శుక్రవారం శ్రీరంగనాథుడు సతీసమేతుడై హంసవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంపీ



కుమార్లకాల్వలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

చక్రాయపేట : మండలంలో జరిగిన పలు అభివృద్ధి పనులను గురువారం కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డిలతో కలిసి కుమార్లకాల్వ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామసచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌తోపాటు ఆర్వోప్లాంట్, బస్ షెల్టర్‌ను ప్రారంభించారు. అనంతరం కుప్పం గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, విలేజ్ క్లినిక్, బీటీపల్లె వద్ద సచివాలయాన్ని ప్రారంభించారు. నాగలగుట్టపల్లె వద్ద సచివాలయం, ఆర్బీకేతో పాటు బీటీపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా వచ్చిన ప్రజలు, కార్యకర్తల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

శ్రీవేంకటేశ్వర రాచరాయస్వామి రథానికి పూజలు
మహాశివరాత్రి వేడుకల నిమిత్తం ప్రతి గ్రామానికి వెళ్లి శివపార్వతులు, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణానికి ఆహ్వానించే నిమిత్తం గ్రామాల్లో పర్యటిస్తున్న పంచకళ్యాణి రథానికి అద్దాలమర్రి క్రాస్ వద్ద ఎంపీ అవినాష్‌రెడ్డి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను కలసి శివరాత్రి వేడుకలకు రావాలని ఎంపీని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, జడ్పీటీసీ శివప్రసాదరెడ్డి, సర్పంచులు శ్రీధర్‌రెడ్డి, లక్షుమయ్య, రమణమ్మ, ఎంపీటీసీలు నారమ్మ, నౌషాద్, పార్టీ నేతలు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా సంజీవరాయస్వామికి పూజలు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్య క్షేత్రంలోని సంజీవరాయస్వామికి బాలాలయ కళాబింబ ఆవాహ పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈఓ బీవీ నరసయ్య ఆధ్వర్యంలో ప్రాంగణంలోని ధ్యాన మందిరంలో వేదపండితులు శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. స్వామి మూలవిరాట్‌ను కదపకుండా ఆలయ నిర్మాణం చేపడతామని ఈఓ చెప్పారు. ఆలయ పునర్నిర్మాణం అయ్యేంత వరకు ఈ బాలాలయంలో స్వామివారి మూలవిరాట్ దర్శన భాగ్యం భక్తులకు ఉండదని, ధ్యానమందిరంలో సంజీవరాయ స్వామిని ఆవాహన చేసుకుని స్వామి ప్రతిమతో కూడిన కళాబింబదారు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహానికి ప్రతి నిత్యం పూజలు, అభిషేకాలు, ఉత్సవాలు యధాతథంగా నిర్వహిస్తామని ఈఓ వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, వేదపండితులు మాధవాచార్యులు, శేషాచార్యులు, పవన్, సురేంద్ర పాల్గొన్నారు.

ఓటు హక్కు ఓ ఆయుధం

పెండ్లిమర్రి : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు శక్తివంతమైన ఆయుధమని ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో గురువారం నెహ్రూ యువకేంద్రం, సాయిసేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిఘా నీడన నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ప్రతి గదిలో సీసీ కెమెరా ఏర్పాటు
- పరీక్షా కేంద్రాలు-3, విద్యార్థులు-990 మంది



పరీక్షా గదుల్లో ఏర్పాటు చేసిన బెంచీలపై నంబర్లు వేస్తున్న సిబ్బంది

కమలాపురం : ఇంటర్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కమలాపురంలోని గురుకుల పాఠశాలతో పాటు పీవీఎస్ఆర్ఎం జూనియర్ కళాశాల కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. అలాగే పెండ్లిమర్రి మండలంలో ఒక పరీక్షా కేంద్రంలో పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం మూడు కేంద్రాల్లో ఫస్ట్ ఇయర్ పరీక్షలు 522 మంది, సెంకడియర్ పరీక్షలు 468 మంది మొత్తం 990 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. శనివారం నుంచి సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు.

గదుల్లో సీసీ కెమెరాలు, బల్లలు :
పరీక్షా కేంద్రాల్లోని అన్ని గదుల్లో అధికారులు బల్లలను ఏర్పాటు చేయడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు. అలాగే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు సమకూర్చామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఒక్క నిమిషం ఆలస్యం అయినా పరీక్షలకు అనుమతించవద్దని ఆదేశాలు అందాయని వారన్నారు. అరగంట ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. గురుకుల పాఠశాల కేంద్రంలో ఫస్ట్ ఇయర్‌కు చెందిన 259 మంది, సెకండియర్‌కు చెందిన 201 మంది పరీక్షలు రాయనున్నారు. అలాగే పీవీఎస్ఆర్ఎం జూనియర్ కళాశాల కేంద్రంలో ఫస్టఇయర్‌కు చెందిన 171 మంది, సెకండియర్‌కు చెందిన 180 మంది పరీక్షలు రాయనున్నారు. అలాగే పెండ్లిమర్రిలోని పరీక్షా కేంద్రంలో ఫస్టియర్‌కు చెందిన 92 మంది, సెకండియర్‌కు చెందిన 87 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



అనిమెల గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారాన్ని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా మండలంలోని సంగమేశ్వరుని దర్శించుకుని అనంతరం అనిమెల గ్రామ సర్పంచు నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మంచి మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగాలని కావున ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ తరపున ప్రచారం చేసేందుకు అన్ని పార్టీల నాయకులు సిద్ధమయ్యారన్నారు. మీ బిడ్డ జగన్‌మోహన్‌రెడ్డికి మీరే ప్రచార సారథులు కావాలని ప్రజలను ఆయన కోరారు. కేవలం ఎన్నికల సమయంలో చెప్పిన మాటలు తరువాత ఆ మాటలను మరిచే నాయకుడు చంద్రబాబు అయితే ఇచ్చిన హామీలను 100 శాతం పూర్తి చేసిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అనంతరం సంగమేశ్వరాలయం వద్ద ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిని రాష్ట్ర సోషియల్ వెల్ఫేర్ చైర్మన్ పులి సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డిలు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల కన్వీనర్లు రఘునాథరెడ్డి, ఉత్తమారెడ్డి, చంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కుమార్‌యాదవ్, భాస్కర్, సురేష్‌యాదవ్, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, వీరపునాయునిపల్లె మండల జేసీఎస్ కన్వీనర్ మహేంద్రారెడ్డి, రాష్ట్ర అగ్రికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాదురెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలయ్య, వీరపునాయునిపల్లె మండల పరిశీలకుడు రాజుపాలెం జగన్‌రెడ్డి, సంగమేశ్వర దేవస్థానం చైర్మన్ శివాంజనేయరెడ్డి, అనిమెల నాయకులు శ్రీనివాసుల్‌రెడ్డి, శంబురెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూగజీవాల భద్రతకే 1962 వాహనం

పోరుమామిళ్ల : మూగజీవాల ఆరోగ్య భద్రత కోసం 1962 సంచార పశు వైద్య వాహనాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జీవీకె సంస్థ రీజనల్ ప్రోగ్రామ్ మేనేజర్ కలీమ్ అన్నారు. పోరుమామిళ్లలో 1962 వాహనాన్ని గురువారం ఆయన పరిశీలించారు. సిబ్బంది అంకిత భావంతో పనిచేసి, రైతులకు మెరుగైన సేవలందించాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. కలీమ్ మాట్లాడుతూ రైతులు టోల్‌ఫ్రీ నెంబర్ 1962కు ఫోన్ చేస్తే వాహనం వచ్చి రైతు ఇంటి వద్దే చికిత్స చేస్తుందన్నారు. ఏడీఏ చంద్రశేఖర్ మాట్లాడుతూ పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాల్లో పశువుల యజమానులకు వాహనంతో గొప్ప ప్రయోజనం కలుగుతుందన్నారు. డాక్టర్ కొమ్మలపాటి అంజలి పాల్గొన్నారు

సంక్షేమ పథకాలతో ప్రజలకు లబ్ధి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రజలు లబ్ధి పొంది ఉంటే ఎమ్మెల్యేగా తనను మరోసారి భారీ మెజారీతో గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి ప్రజలను కోరారు. గురువారం పట్టణంలోని 16వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధి గురించి వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న నాయకులు ఫ్యాక్షన్ ను ప్రోత్సహించారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎంపికైన నాలుగున్నర సంవత్సరాల కాలంలో చిన్న సంఘటనలు కూడా నియోజకవర్గంలో జరుగలేదన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ప్రజలను నావల్ల లబ్ధి పొంది ఉంటేనే ఓట్లు వేయండని అడిగిన దాఖలాలు లేవన్నారు. నియోజకవర్గంలో చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేలు వైఎస్సార్ నేతన్న నేస్తంతోపాటు, 50 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులను పెన్షన్ ఇస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి చేసుకునే అవకాశం ఇవ్వాలంటూ ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, డాక్టర్ ఆగస్టీన్ రాజు, వైఎస్ చైర్మన్ సింగరయ్య, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌బాషా, కిరన్‌తానీషా, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటిసమస్య లేకుండా చూడండి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కొండాపురం : వేసవి కాలంను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఎంపీపీ లక్ష్మిదేవి ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

అనంతరం గ్రామాల్లో ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తాళ్లప్రొద్దుటూరు వైద్యురాలు రేహాన తెలిపారు. అలాగే మండలంలోని రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు పంట నమోదు చేసి ఈకేవైసీ చేయించామని సబంధిత అధికారులు తెలిపారు. అలాగే తీసుకున్న పంట రుణాలపై వడ్డీ రాయితీ మండలంలోని డీబీటీ ద్వారా రూ.13.35 లక్షలు రైతుల ఖాతాలో జమ అయిందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో పనులు కల్పిస్తామని ఏపీఓ వెంకట సుబ్బమ్మ తెలిపారు. అజెండలోని అంశాల వారిగా అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎఓ శ్రీనివాసులురెడ్డి, ఉప మండలాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు సుదర్శన్‌రెడ్డి, శివారెడ్డి, క్రిష్ణనారాయణరెడ్డి, ఎంపీటీసీలు డీటీ సర్వేయర్ రాజేశ్వరి అధికారులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను జయప్రదం చేద్దాం



పాల్గొన్న ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వలంటీర్లు



పులివెందులలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : 0-5 ఏళ్ల చిన్నారులందరికి పల్స్‌పోలియో చుక్కల మందు వేసి జయప్రదం చేద్దామని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వలంటీర్లకు పల్స్ పోలియోపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఈనెల 3 తేదీన జరగబోయే కార్యక్రమంలో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్ల పిల్లలందరికి పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పోలియో చుక్కలు వేసే రోజు ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంపీహెచ్ఈఓ సతీష్‌కుమార్ మాట్లాడుతూ వ్యాక్సినేటర్లు చేయవలసిన విధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, కౌన్సిలర్లు పార్నపల్లె కిషోర్, వైద్యులు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : ఈనెల 3న పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రి సూపరిండెంట్ డెవిడ్ సెల్వరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0 నుంచి 5 ఏళ్లలోపు పిల్లలందరికి తల్లి దండ్రులు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించుకోవాలన్నారు అందువల్ల ఈనెల 3, 4 తేదీలలో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తమ పరిధిలో ఉన్న కేంద్రాలలో తప్పని సరిగా చిన్ని పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయాలన్నారు

వీరపునాయునిపల్లెలో..
వీరపునాయునిపల్లె : పోలియో రహిత సమాజాన్ని నిర్మంచేందుకు ప్రతి ఒక్కరూ బాగస్వాములు కావాలని మండల వైద్యాధికారి మహ్మద్ తాహా తెలిపారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 3వ తేదీన నిర్వహించబోవు పల్స్‌పోలియో కార్యక్రమంపై సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో 39 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. చిన్నారుల తల్లింతండ్రులు తమ బిడ్డలను పోలియో కేంద్రాలకు తీసుకెళ్లి తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.



వీఎన్‌పల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

లింగాలలో..
లింగాల : ఈనెల 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి సుభాషిణి తెలిపారు. గురువారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లుతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 3, 4 తేదీలలో మండల పరిధిలోని గ్రామాలలో పర్యటించి చిన్న పిల్లలను గుర్తించి వారికి తప్పకుండా పోలియో చుక్కలు వేయాలన్నారు. రెండు రోజులలో పోలియో చుక్కలు వేయించుకోని వారికి 5వ తేది ఇంటింటికి వెళ్లి పిల్లలకు పోలియో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శరవేగంగా మెడికల్ కళాశాల నిర్మాణ పనులు



పులివెందులలో ప్రారంభానికి సిద్ధమవుతున్న వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాల

పులివెందుల రూరల్ : పట్టణంలోని కడప రోడ్డులో సుమారు 50 ఎకరాలలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పులివెందుల నియోజకవర్గంలోని ప్రజలకేకాక ఇతర ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించే విధంగా 24 గంటలు వైద్యం అందుబాటులో ఉండేందుకు రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మెడికల్ నర్సింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం 100 సీట్లు కేటాయిస్తారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

రైతులు సీఎం యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి



రెతుల దిగుబడులను పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : మండలంలోని రైతులు 2023-24 రబీలో సాగు చేసిన పంటల దిగుబడులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు తమ పేర్లను సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. గురువారం మండలంలోని మీరాపురం వద్ద రైతుల దిగుబడులను ఆమె పరిశీలించి మాట్లాడారు. రైతులు తాము పండించిన పంటల దిగుబడులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునే వారు పేర్లను సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం పంట దిగుబడుల మద్దతు ధర ప్రకటించిందన్నారు. మినుము క్వింటా మద్దతు ధర రూ.6,950, వేరుశనగ ధర రూ.6,377, బుడ్డ శనగ రూ.5,440, పెసర ధర రూ.8558 గా నిర్ణయించిందన్నారు. తమ దిగుబడులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలనుకునే రైతులు సమీప ఆర్‌బీకేలకు వెళ్లి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.